# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 20 ఏప్రిల్ 2025 | HYDERABAD




## వర్ష సూచన

సిటీబ్యూరో: ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



**కండ్లకు కట్టినట్లు..**

రైల్ నిలయంలో శనివారం తెలంగాణ ఆక్టోపస్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ జరిగింది. ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు రైల్వే ఉద్యోగులను కాపాడే విధానాన్ని కండ్లకు కట్టినట్లు చూపెట్టారు.




# దండులా కదలిరండి..

రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పిలుపు


*గ్రేటర్ హైదరాబాద్‌లోని కాలనీలు, బస్తీల్లో పార్టీ జెండా ఎగురవేసి ఆవిర్భావ సభకు దండులా కదిలిరావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. 27 న జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ సభ తెలంగాణ ప్రజల ఇంటి పండుగ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలు, కార్యకర్తలతో తెలంగాణ భవన్ లో శనివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ నుంచి మహాసభకు లక్షలాదిగా తరలిరావాలన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యం, అనితరసాధ్యమైనవన్నారు. గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కలేదని చెప్పారు. హైదరాబాద్ ప్రజల ముందు కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు, దొంగనాటకాలు పనిచేయలేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ముఠాగోపాల్, సుధీర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభివాణీదేవి, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.*

*- సిటీ బ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ)*

# కరెంటోళ్లపై కస్సుబుస్సు

- సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ
- స్పందించని విద్యుత్ సిబ్బంది

*విద్యుత్ శాఖ పనితీరు చూసి.. మండిపడ్డారు నగరవాసులు.. శుక్రవారం నగరంలో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైంది.. స్తంభాలు కూలడం.. తీగలు తెగిపోవడం..ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం.. ఫీడర్ల ట్రిప్ వంటి సమస్యలతో పలు చోట్ల కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సకాలంలో స్పందించి పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అధికారులు.. కనీసం ప్రజల నుంచి ఫిర్యాదులపై కూడా స్పందించలేదు.. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం వరకు..మరికొన్ని చోట్ల అసలు సరఫరానే పునరుద్ధరించలేదు.. ఎక్కడ విద్యుత్ సమస్యలు వచ్చినా.. 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండంటూ.. చెప్పినా.. ఆ నంబర్ అసలు పనిచేయడమే లేదని వినియోగదారులు మండిపడుతున్నారు. ఈ ఒక్క నంబరే కాదు.. ఎవరికీ ఫోన్ చేసినా.. ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. ఒక్కరోజు వానకే పరిస్థితి ఇలా ఉంటే ఎలా.. అని సిటీజనం కరెంటోళ్లపై కస్సుబుస్సుమన్నారు.*



**పనిచేయని 1912**

ఎవరికీ ఫోన్ చేసినా..

ఫలితం సున్నా

సకాలంలో జరగని పునరుద్ధరణ

సిటీజనం ఆగ్రహం

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): నగరంలో శుక్రవారం కురిసిన వర్షానికి, ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. చాలా చోట్ల పునరుద్ధరణ పనుల్లో తీవ్రజాప్యం జరిగిందంటూ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖైరతాబాద్, నాంపల్లి, లంగర్‌హౌజ్, మలక్‌పేట, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం కొన్ని చోట్ల, మధ్యాహ్నం వరకు మరికొన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణే జరగలేదు. ఫీడర్లు ట్రిప్ అయిన చోట సైతం చాలా ఆలస్యంగా కరెంట్ వచ్చిందంటూ నగరవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఒక్కరోజు వర్షానికి ఈ పరిస్థితే ఇలా ఉందంటే నెలరోజుల కాలంలో ఇలా వర్షాలు కురవడం మూడోసారి. ఈనెల మొదటివారంలో ఒక సబ్‌స్టేషన్‌లో ఎఫ్ఓసీ ఆపరేటర్ వినియోగదారుడితో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆ ఉద్యోగికి సీఎండీ ముషారఫ్ మెమో ఇవ్వగా, మరో చోట మద్యం మత్తులో అసలు వినియోగదారుల ఫోన్లే ఎత్తని ఉద్యోగిని సస్పెండ్ చేశారు. శుక్రవారం ఓ ఏరియాలో విద్యుత్ పునరుద్ధరించాలంటూ లైన్‌మెన్‌కు ఫోన్ చేస్తే రూ.500 ఇస్తే వచ్చి సెట్ చేస్తానని చెప్పాడని ఒక వినియోగదారుడు సీఎండీకి సోషల్‌మీడియా వేదికగా ఫిర్యాదు చేశారు.

### 300కుపైగా ఫిర్యాదులు

ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ల పనితీరు అధ్వానంగా ఉంది. ఇక టోల్‌ఫ్రీ కేవలం చెప్పుకోవడానికే పరిమితమైంది. ఉన్నతాధికారులు మాత్రం తాము ఎక్కడి నుంచి ఫిర్యాదులొచ్చినా ఠంటనే స్పందిస్తున్నామని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. శుక్రవారం ఒక్కరోజే సుమారుగా 300కు పైగా ఫిర్యాదులొచ్చాయని విద్యుత్ సిబ్బంది చెప్పారు. వీటికి సంబంధించి పరిష్కారం విషయంలో మాత్రం ఎప్పటికప్పుడు ప్రయత్నించినా కొన్ని ఫిర్యాదులు ఆలస్యంగా పరిష్కరించామని, మరికొన్నింటికి టైం పడుతుందని వారు పేర్కొన్నారు.

### పేరుకే టోల్‌ఫ్రీ..

ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తినా వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండంటూ బాకా ఊదిన విద్యుత్ అధికారులు.. ఆ నంబర్ పనిచేస్తుందా చేయట్లేదా అనే అంశంపై దృష్టి పెట్టడం లేదు. తమ ఏరియాల్లో కరెంట్ పోయినప్పుడు వెంటనే కాల్ చేయండంటూ ఇచ్చిన ఎఫ్ఓసీ నంబర్లు దాదాపు స్విచ్ఛాఫ్ ఉంటున్నాయి. అకాల వర్షం పడితే, అకస్మాతుగా కరెంట్ పోతే వెంటనే తమకు కాల్ చేయాలని డీఈలు ఇచ్చిన నంబర్లే పనిచేయడం లేదంటే ఎస్‌పీడీసీఎల్ నిర్వహణ ఎంత దారుణంగా ఉందో చూడాలని వినియోగదారులు అంటున్నారు.

### ఏ నంబర్లూ పనిచేయడం లేదు..

రాత్రంతా కరెంట్ లేకపోవడంతో సరూర్‌నగర్ కంట్రోల్ రూంకు కాల్ చేశాం. వారు సబ్‌స్టేషన్ నంబర్ ఇచ్చారు. వారికి కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. లైన్‌మెన్ నంబర్‌కు చేస్తే మేము వేరే దగ్గర పనిలో ఉన్నాం.. అని చెబుతున్నారు. వర్షం పడినప్పుడు కంటే ఆగిపోయిన తర్వాత విద్యుత్ కోతలు ఇబ్బంది పెడుతున్నాయి. 1912కు కాల్ చేస్తే అసలు రెస్పాన్స్ లేదు.

*– ప్రణీత్ రెడ్డి, సరూర్‌నగర్*

### స్విచ్ఛాఫ్ పెట్టారు..

మా ఏరియాలో గంటల తరబడి కరెంట్ పోతుందని 1912 కు కాల్‌చేశాం. కానీ కాల్ మొదట్లోనే కట్ అయిపోతుంది. అకాల వర్షాల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే తమకు సమాచారమివ్వాలని విద్యుత్ అధికారులు ఎఫ్ఓసీ నంబర్లు ఇచ్చారు. 9490619806 నంబర్‌కు కాల్‌చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. రాత్రంతా కరెంట్ లేక జాగారం చేశాం. కానీ విద్యుత్ సిబ్బంది ఎవరూ స్పందించలేదు.

*– యాకుబ్, జహనామా ప్రాంతవాసి*

# ల్యాండ్ పూలింగ్‌పై పీచేముడ్!

- బెడిసికొట్టిన హెచ్‌ఎండీఏ పథకం
- చేతులెత్తివేసిన అధికార యంత్రాంగం
- భూములు ఇచ్చేందుకు ముందుకు రాని రైతులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): భూములను భారీగా సమీకరిద్దాం... మౌలిక వసతులు కల్పిద్దాం. ఇక వాటిని లే అవుట్లుగా అభివృద్ధి చేసి సొమ్ము చేసుకుందామనే మార్కెటింగ్ స్ట్రాటజీతో హెచ్‌ఎండీఏ రూపొందించిన వ్యూహం బెడిసికొట్టింది. భూములు ఇచ్చే వారు లేకపోవడంతో ల్యాండ్ పూలింగ్ స్కీం నీరుగారిపోతున్నది. వాటా విషయంలోనే రైతులు, హెచ్‌ఎండీఏ మధ్య సయోధ్య లేకపోకుండాపోయింది. దీంతో గ్రామ సభల్లోనే రైతులు భూములు ఇవ్వలేమని తేల్చి చెప్పేశారు.

### ఖజనా నింపుకొనేందుకు..

ఖజనా నింపుకొనేందుకు హెచ్‌ఎండీఏ ల్యాండ్ పూలింగ్ పథకానికి తెరలేపింది. మోకీల మండలం, శంకర్‌పల్లి గ్రామంలో దాదాపు 456 ఎకరాలు, ఘట్‌కేసర్ మండల పరిధిలోని ప్రతాప సింగారం, కొర్రెముల్లా గ్రామాల పరిధిలో మరో 1000 ఎకరాల భూములను సేకరించేలా ప్రణాళికలను రచించింది. రైతుల నుంచి నిరభ్యంతర పత్రాలను కూడా స్వీకరించింది. ఇప్పుడు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులే... అభ్యంతరం వ్యక్తం చేస్తుండటంతో ల్యాండ్ పూలింగ్ సందిగ్ధంలో పడింది.

### ముందుకు రాని రైతులు

భూముల ధరలు విపరీతంగా పెరగడం, కమర్షియల్ యాక్టివిటీ విస్తరించడంతోనే హెచ్‌ఎండీఏ ఇచ్చే పరిహారం తక్కువగా ఉందని రైతులు భావిస్తున్నారు. అభివృద్ధి చేసిన 70 శాతం భూమిని తమకే ఇవ్వాలని, ప్రతాపసింగారంలో గ్రామసభలో రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.మార్కెట్ ధరతో పోల్చితే తక్కువ ఉందని చాలా మంది రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎండీఏ ఇచ్చే నిష్పత్తి 60: 40 ఉంటుందని, దీంతోపాటు పూర్తి స్థాయిలో డెవలప్ చేసిన ప్లాట్లు అందుబాటులోకి వస్తాయని భూములకు మరింత డిమాండ్ పెరుగుతుందని వివరించారు. సర్కారు 60 శాతానికి మించి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ముందుకు రావడం లేదు.




# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో తాత్సారం

మేడ్చల్, ఏప్రిల్19(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో తాత్సారం జరుగుతున్నది. మేడ్చల్ జిల్లాలో 308 మందిని మాత్రమే ఇప్పటి వరకు ఎంపిక చేశారు. అయితే శుక్రవారం నుంచి 21 వరకు ఇందిరమ్మ ఇంటి పథకానికి మరో విడతగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎంపీడీవోలకు బాధ్యతలను అప్పగించారు. ఇందిరమ్మ కమిటీలతో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక జాబితాను సిద్ధం చేయనున్నారు.ఈ జాబితాను ఈ నెల 22 నుంచి 28 వరకు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు ఎంపీడీవోలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించి.. ఇందిరమ్మ ఇంటి పథకానికి ఎంపిక జాబితాను రెడీ చేస్తారు. అయితే ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేస్తారా లేక వారు అనుకున్న వారిని ఎంపిక చేస్తారా అనే సందేహాలను దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలోని జీహెచ్‌ఎంసీ పరిధిలోని మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇంటి పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై దరఖాస్తుల పరిశీలన ప్రారంభించలేదు. ఇక లబ్ధిదారులను ఎంపిక ఎప్పుడు చేస్తారని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు.

# నిమ్స్‌లో ఆటోమేటిక్ బీపీ టెల్లింగ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: నిమ్స్ వైద్యశాలలో రక్తపోటును పరీక్షించే అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.12 లక్షల విలువైన బీపీ టెల్లింగ్ మిషన్లను దవాఖానలోని సెక్యూరిటీ కార్యాలయం ప్రాంగణంలో ఒకటి, ఎమర్జెన్సీ బ్లాక్ వద్ద ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే ఈ ఆటోమేటిక్ బీపీ టెల్లింగ్ మిషన్ల కోసం ప్రత్యేకంగా గదులను నిర్మించారు. ఈ యంత్రాల ద్వారా బీపీతో పాటు పల్స్ రేట్‌ను సైతం తెలుసుకోవచ్చు. ఈ మేరకు శనివారం వేం చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఐశ్వర్య రెడ్డి రెండు ఆటోమేటిక్ బీపీ యంత్రాలతో పాటు 10 ఎయిర్ కూలర్‌లు, 13 ట్రాలీలను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప చేతుల మీదుగా విరాళమిచ్చారు. అనంతరం ఆమె ఈ యంత్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ , అడిషనల్ సూపరిండెంట్స్ డా. వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీపీ టెల్లింగ్ యంత్రాలను ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు



ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద దస్తావేజు లేఖరుల నిరసన

# స్లాట్ విధానం వద్దు..!

దస్తావేజు లేఖరుల బంద్

రామంతాపూర్/చిక్కడపల్లి/శంషాబాద్ రూరల్: స్లాట్ బుకింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా పలు ఎస్ ఆర్ ఓ కార్యాలయాల వద్ద దస్తావేజు లేఖరులు బంద్ పాటించారు. ఇందులోభాగంగా ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు నిరసన తెలిపారు. టీడీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ కుమార్, ఉపాధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రామకృష్ణ గౌడ్ పలు ప్రాంతాల్లో దస్తావేజు లేఖరులకు సంఘీభావం తెలిపారు.